





వినుకొండ : తాళాలు వేసి ఉన్న నరగాయపాలెం సచివాలయం

డబ్బులు లేవు పించన్ లేదు

డబ్బులు లేవు.. పింఛన్ ఇవ్వలేము. నగదు రాకుంటే మేమేమి చేస్తాం.. ఇదీ తొలి రోజు సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ తీరు. సచివాలయాల ఖాతాలకు నగదు జమ చేయలేదు. అయినా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వృద్ధులు ఎంతో ఆశతో అష్ట కష్టాలు పడి సచివాలయాలకు వస్తే సిబ్బంది సమాధానంతో నిరాశకు గురయ్యారు. ఉదయం.. మధ్యాహ్నం.. సాయంత్రం అంటూ వృద్ధులను చాలా చోట్ల సచివాలయాల సిబ్బంది తిప్పుకున్నారు. కొన్ని దగ్గర్ల అయితే వృద్ధులు, దివ్యాంగులు సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. వయో వృద్ధులు, దివ్యాంగులు ఉదయం 7 గంటల నుంచే సచివాలయాల వద్దకు చేరుకున్నా కొన్ని దగ్గర్ల రాత్రి వరకు వారికి పింఛన్ ఇవ్వలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మూడొంతుల సచివాలయాల్లో ఇదే పరిస్థితి. తొలిరోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నూటికి ముగ్గురికి కూడా పింఛను అందలేదంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. అయితే ప్రభుత్వం కావాలని వృద్ధులకు పడిగాపుల శిక్ష విధించిందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

- సచివాలయాల ఖాతాలకు జమకాని నగదు
- డబ్బులు రాకుంటే మేం ఏంచేస్తామన్న సిబ్బంది
- పలు సచివాలయాల్లో ప్రారంభమేకాని పంపిణీ
- మూడు జిల్లాల్లో 25 శాతం మందికే పింఛన్లు..
- వృద్ధులకు పడిగాపుల శిక్షపై ప్రతిపక్షాల ఆగ్రహం

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ.. పింఛన్ల పంపిణీని అధికార పార్టీ రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకుంటుందా అంటే.. బుధవారం నాటి పరిస్థితులు అవుననంటున్నాయి. మండే ఎండల్లో వృద్ధులు, దివ్యాంగులు, రోగులు సచివాలయాలకు రాలేరని తెలిసి కూడా వారితో ప్రభుత్వం ఆడుకుంది. అష్టకష్టాలు పడి సచివాలయాలకు వచ్చినా పింఛన్ ఇవ్వకుండా పడిగాపుల శిక్ష వేసింది. ప్రతి నెలా ఒకటో తేదీన ఇస్తున్న పింఛన్‌ను ఏప్రిల్‌లో రకరకాల కారణాలు చెప్పి మూడో తేదీకి వాయిదా వేసిన ప్రభుత్వం, ఆ రోజు కూడా వృద్ధులకు చుక్కలు చూపించింది. సచివాలయాల ఖాతాలకు నగదు జమ చేయకుండా పింఛన్ల పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మెజారిటీ సచివాలయాల్లో మధ్యాహ్నం వరకూ పింఛన్ల పంపిణీ ప్రారంభమే కాలేదు. ఒక్కో మండల పరిధిలో సగటున 15 సచివాలయాలు ఉంటే 3, 4 సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నిధులు పడ్డాయి. వాస్తవానికి ఆ నిధులు ముందురోజే సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా ప్రభుత్వం వాటిని మంజూరు చేయలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు పింఛను పంపిణీపై చేతులెత్తేశారు. సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సమాధానం చెప్పలేక సిబ్బంది బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి మరికొన్ని బ్యాంకుల్లో నిధులు జమవడంతో కొన్ని దగ్గర్ల పింఛన్ల పంపిణీ జరిగింది. మున్సిపాలిటీల్లో కొన్ని సచివాలయాలు, పలు మండల కేంద్రాల్లో కొన్నిదగ్గర్ల మాత్రమే అరకొరగా పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీర్ల సేవలున్నప్పుడు ప్రభుత్వం ఒకే రోజున నగదు మొత్తాన్ని విడుదల చేసేది. అలాంటిది ఇప్పుడు అరకొరగా విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ప్రతిపక్షాలపై పింఛన్‌దారుల్లో వ్యతిరేకత ఏర్పరచడమే దీని ఉద్దేశమన్న ఆరోపణలు వస్తున్నాయి. కాగా కొన్ని సచివాలయాల వద్ద వైసీపీ నాయకులు మకాం వేసి టీడీపీ వల్లే ఈ ఇబ్బందులన్న రీతిలో ప్రచారం చేయించే ప్రయత్నం చేశారు. దీనిని పసిగట్టిన సచివాలయాల సెక్రెటరీలు సెక్రెటేరియట్ల కాంపౌండ్లలో పింఛన్‌దారులు మినహా మరెవరూ ఉండటానికి వీల్లేదని, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించడంతో వారు జారుకున్నారు.



తెనాలిలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పింఛన్ల పంపిణీ చేస్తామని యంత్రాంగం చెప్పడంతో వేచి ఉన్న వృద్ధులు

వృద్ధులకు శిక్ష.. ప్రభుత్వ కుట్ర

పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతనలేకుండా ఉంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, రోగులకు ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, సచివాలయాల సిబ్బంది నేరుగా వచ్చి అందిస్తారని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఏ సచివాలయ పరిధిలోనూ ఇది అమలు కాలేదు. అదేమంటే తమకు ఆదేశాలు అందలేదని సచివాలయాల సిబ్బంది చెప్పారు. నగదు కావాలంటే సచివాలయాలకు రావాల్సిందే అని సిబ్బంది సూచించారు. దీంతో అష్టకష్టాలు పడి పలువురు పింఛన్ కోసం సచివాలయాలకు వచ్చారు. ఎండలో సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. నగదు జమ కాకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఖాతాల్లో నగదు జమకాలేదని, తామేమీ చెయ్యలేమంటూ సిబ్బంది తేల్చి చెప్పారు. దీంతో ఉదయం వచ్చి మధ్యాహ్నం వరకు వేచి ఉన్న వారు విసిగిపోయి.. ఎండలో ఉండలేక ఇళ్లకు వెళ్లిపోయారు. రేపల్లెలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొన్ని సచివాలయాల్లో నగదు జమ కావటంతో పింఛన్ల పంపిణీని 4 గంటల సమయంలో ప్రారంభించారు. వేమూరు పరిధిలో చదలవాడ, వరహాపురం, కుచ్చెళ్లపాడు, వెల్లబాడు, చావలి, పెరవలి, పెరవలిపాలెం, జంపని గ్రామాలకు నగదు అందడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పంపిణీ ప్రారంభించారు. కొల్లూరు మండలం అనంతవరం సచివాలయ పరిధిలో 432 పింఛన్లకు సంబంధించి రూ.12 లక్షల వరకు నగదు జమ కావాల్సి ఉండగా కేవలం రూ.25 వేలు మాత్రమే జమ చేశారు. దీంతో 75 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది అందజేశారు. దీనికి తోడు మధ్యమధ్యలో సాంకేతిక కారణాలతో పింఛన్ల పంపిణీకి అంతరాయం ఏర్పడింది. వినుకొండ పరిధిలోని నరగాయపాలెం సచివాలయానికి సిబ్బంది ఏకంగా తాళాలు వేసి వెళ్ళిపోయారు. దీంతో పింఛన్ కోసం వచ్చిన వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో 700 పింఛన్లు ఉండగా సచివాలయంలో కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండటంతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. గుంటూరులో తొలిరోజు నగదు విడుదల కాకపోవడంతో 12 సచివాలయాల పరిధిలో పంపిణీనే ప్రారంభం కాలేదు. ప్రభుత్వం కుట్రతోనే తమకు పడిగాపుల శిక్ష విధించిందని పలువురు మండిపడ్డారు.

మధ్యాహ్నం వరకు 2.5 శాతమే..

బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకి మూడు జిల్లాల్లో పింఛన్ల పంపిణీ సగటున 2.5 శాతంగా ఉంది. గుంటూరు జిల్లాలో 2 లక్షల 61వేల మంది పింఛనుదారులు ఉండగా వారిలో 5,630 మందికి మాత్రమే మధ్యాహ్ననికి పింఛన్లు అందాయి. పల్నాడు జిల్లాలో 2లక్షల 82వేల మందిలో 5,369 మందికి, బాపట్ల జిల్లాలో 2 లక్షల 35వేల మందిలో 9,300 మందికి పింఛన్లు అందాయి. మధ్యాహ్నం నుంచి బ్యాంకుల్లో నిధులు జమ కావడం మొదలవడంతో పింఛన్ల పంపిణీ మొదలైంది. సాయంత్రానికి బాపట్ల జిల్లాలో 41.99 శాతం, గుంటూరు జిల్లాలో 41.61 శాతం, పల్నాడు జిల్లాలో 44.75 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. అరకొరగా నగదు విడుదలతో ఈ స్థాయిలో పింఛన్ల పంపిణీ జరిగింది.

ప్రతిపక్షాలపై నెపం వేసేందుకేనా?

ఒకవైపు మండే ఎండలు.. మరోవైపు సచివాలయాలకు వస్తేనే పింఛన్ ఇస్తాం అని చెప్పి.. అష్టకష్టాలు పడి వచ్చిన వారికి నగదు అందజేయని ప్రభుత్వ తీరును చూసిన పలువురు అధికార పార్టీ కావాలని ఇదంతా చేస్తోందని ఆరోపిస్తున్నారు. పింఛన్ల పంపిణీలో లోటుపాట్లు సరిచేసుకోకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కావాలని ప్రతిపక్షాలపై నెపం వేసేందుకు బుధవారం నాటి పరిణామాలను ప్రభుత్వం సృష్టించిందన్న విమర్శలు వచ్చాయి. మధ్యాహ్నం వరకు కూడా పింఛన్ పంపిణీ జరగకపోవడం, లబ్ధిదారుల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేని సచివాలయ సిబ్బంది అసలు విషయం చెప్పేశారు. బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కాలేదు.. అందువల్ల పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని చేతులెత్తేశారు. దీంతో లబ్ధిదారులకు అసలు విషయం బోధపడింది. దీంతో ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలు పటాపంచలైపోయాయి. ప్రభుత్వమే నిధులు మంజూరు చేయకుండా ఓట్ల నాటకానికి తెర తీసిందని పలువురు తెలుసుకున్నారు. నేరుగా తమ ఖాతాల్లో వేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం, అధికార వైసీపీనే తమను మండుటెండల్లో సచివాలయాల వద్ద పడిగాపులు పడేలా చేసిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చీరాల బరి చైతన్య ఝరి

నియోజకవర్గ ముఖచిత్రం

చీరాల పోరాటాల పురిటి గడ్డ. ఇక్కడి ప్రజలు చైతన్య వంతు లు. ఉద్యమ నేపథ్యం వారి సొంతం. బ్రిటీష్ పాలకులు చీరాల, పేరాల గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేస్తే వ్యతిరేకించారు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణ మహాత్మాగాంధీ సూచించిన మార్గాల్లో ఒకటైన పుర బహిష్కరణతో బ్రిటీష్ పాల కుల మెడలు వంచారు. నియోజక వర్గ పరిధిలోని వేటపాలేనికి చెందిన అలివేలు మంగతాయారు స్వాంతంత్రోద్యంలో పాల్గొన్న తొలి మహిళగా ప్రతీతి. లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని బాపట్ల ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. ఈ జిల్లా పరిధిలోకి చీరాల అసెంబ్లీ నియోజక వర్గం వచ్చింది. ఈ క్రమంలో చీరాల నియోజక వర్గం గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..



- పోరాటాల పురుటిగడ్డ.. రాజకీయ చైతన్య దీపిక
- భిన్నత్వంలో ఏకత్వం ఇక్కడి ప్రత్యేకత
- ఓటరు తీర్పు విలక్షణం
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిని అందించిన నియోజకవర్గం
- తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన డాక్టర్ కొణిజేటి రోశయ్య
- వస్త్రవ్యాపారానికి చినబొంబాయిగా ప్రసిద్ధి

నియోజవకర్గ ఓటర్లు **2,00,332**
పురుషులు **97,559**
మహిళలు **1,02,750**
ఇతరులు : 23

చీరాల, ఏప్రిల్ 3: చీరాల నియోజకవర్గం ప్రజలు భిన్న మతాలు, కులాల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం స్పష్టంగా కనిపిస్తుంది. పరస్పరం గౌరవించుకుంటారు. పరమత సహనం పాటిస్తారు. చీరాల నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ స్థిరపడ్డవారి సంఖ్య అధికంగానే ఉంటుంది. సుమారు 18 కిలో మీటర్లు పొడవున సముద్ర తీరప్రాంతం ఉంది. మత్స్యకార గ్రామాల్లో వారి కట్టుబాట్లు వేరుగా ఉంటాయి.

ఓటరు తీర్పు విలక్షణం..

చీరాల నియోజకవర్గ ఓటరు తీర్పు విలక్షణంగా ఉంటుంది. చైతన్యవంతంగా ఆలోచిస్తారు. తమకు మేలు చేస్తారని ఓటు ద్వారా ఆశీర్వదిస్తారు. లేదంటే తిరస్కరిస్తారు. 1952లో నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు అందుకు నిదర్శనంగా రాజకీయ పండితులు విశ్లేషిస్తుంటారు.

ఇప్పటి వరకు 16 పర్యాయాలు ఎన్నికలు

చీరాల నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 16 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1980లో ఒక పర్యాయం ఉపఎన్నిక జరిగింది.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1952	ప్రగడ కోటయ్య	కేఎంపీపీ	యూయూ గుప్తా	ఇండి	8,231
1955	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	జేఎల్ నారాయణ	సీపీఐ	6,073
1962	జేఎల్ నారాయణ	సీపీఐ	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	5,054
1967	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	కొణిజేటి రోశయ్య	ఇండి	2,566
1972	జి.కోటయ్య	కాంగ్రెస్	సజ్జా చంద్రమౌళి	ఇండి	608
1978	ఎం.వెంకటేశ్వర్లు	కాంగ్రెస్(ఐ)	సజ్జా చంద్రమౌళి	జనతాపార్టీ	1857
1980	సజ్జా చంద్రమౌళి	జనతా పార్టీ	బీఎస్పీ బండ్ల	కాంగ్రెస్(ఐ)	19,573
1983	చిమటా సాంబు	టీడీపీ	బీబీ వెంకటేశ్వర్లు	కాంగ్రెస్(ఐ)	33,687
1985	సజ్జా చంద్రమౌళి	టీడీపీ	అందె నరసింహారావు	కాంగ్రెస్(ఐ)	8,766
1989	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	చిమటా సాంబు	టీడీపీ	23,333
1994	పాలేటి రామారావు	టీడీపీ	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	3,606
1999	పాలేటి రామారావు	టీడీపీ	గోలి అంజలీదేవి	కాంగ్రెస్(ఐ)	13,508
2004	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	పాలేటి రామారావు	టీడీపీ	30,077
2009	ఆమంచి కృష్ణమోహన్	కాంగ్రెస్(ఐ)	జంజనం శ్రీనివాసరావు	టీడీపీ	11,286
2014	ఆమంచి కృష్ణమోహన్	నవోదయం	పోతుల సునీత	టీడీపీ	10,335
2019	కరణం బలరాం	టీడీపీ	ఆమంచి కృష్ణమోహన్	వైసీపీ	17,419

నియోజకవర్గం ఆవిర్భావం తొలినాళ్లలో ప్రస్తుతం పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడు మండలంలో సింహభాగం చీరాల నియోజకవర్గంలో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన తరువాత చీరాల పట్టణం, చీరాల, వేటపాలెం మండలాలతో నియోజకవర్గం రూపాంతరం చెందింది. ఈ నియోజకవర్గం నుంచి ప్రగడ కోటయ్య, సజ్జా చంద్రమౌళి, కొణిజేటి రోశయ్య, చిమటా సాంబు, డాక్టర్ పాలేటి రామారావు, ఆమంచి కృష్ణమోహన్‌లు పలుమార్లు పోటీచేశారు. గెలుపు, ఓటములను చవిచూశారు. 2019 ఎన్నికల్లో కరణం బలరామకృష్ణమూర్తి గెలుపొందారు.



చీరాల పురపాలక సంఘ కార్యాలయం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా రోశయ్య

చీరాల నుంచి పలుమార్లు పోటీచేసి గెలుపు, ఓటములను చవిచూచిన డాక్టర్ కొణిజేటి రోశయ్య ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాజకీయం నేపథ్యం నామమాత్రంగా కూడా లేని చిమటా సాంబు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలుపొంది సత్తాచాటారు. డాక్టర్ పాలేటి రామారావు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. వారివురు యాదవ సామాజికవర్గానికి చెందినవారు.

ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థులు

టీడీపీ, జనసేన, బీజేపీ(ఎన్‌డీఏ) కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీకి తరపున ఎంఎం కొండయ్యను, వైసీపీ తరపున కరణం వెంకటేష్‌ను ఆయా పార్టీలు ప్రకటించాయి. కొండయ్య నియోజవర్గంలో తొలిసారిగా పోటీచేస్తున్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తండ్రి కరణం బలరామకృష్ణమూర్తి 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఆ తరువాత వైసీపీకి మద్దతు తెలిపారు. ఆయన కుమారుడు వెంకటేష్ పార్టీ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ బరిలో నిలిచారు. అభ్యర్థులిద్దరు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

- పద్మశాలి : 29,000
- దేవాంగ : 26,000
- ఎస్సీ : 33,000
- (మాల 27,000,
- మాదిగ 6వేలు)
- యాదవ : 26,000
- వైశ్య : 22,000
- రెడ్డి : 11,500
- కాపు : 11,500
- ముస్లిం : 10,500
- మత్స్యకారులు :
- 9,000
- (పట్టపు, పల్లెకారులు)
- ఎస్టీ : 10,000
- (ఎరుకుల, యానాది)
- కమ్మ : 4,000
- ఇతరులు : 8,000



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు

ఇంటి వద్దే.. పెన్షనివ్వాలి

- సచివాలయ సిబ్బందితో అందించాలి
- కూటమి ఎంపీ , ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 3: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే పెన్షన్ అందించే కార్యక్రమాన్ని చేపట్టాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, పార్టీ శ్రేణులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సచివాలయాల వద్దకు వెళ్లి పెన్షన్ తీసుకోవాలని ప్రభుత్వం చెప్పటం సరికాదన్నారు. వేసవి తీవ్రత వల్ల అనారోగ్యంతో ఉన్న వారు సచివాలయాల వద్దకు వెళ్ళలేరన్నారు. ప్రభుత్వం వారి జీవితాలతో ఆటలాడుకోకుండా తక్షణమే ఇంటికి పెన్షన్ పంపించాలన్నారు. తాము వలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదన్నారు. వైసీపీ మూకలు దీనిని టీడీపీ వారు చేయించారని చెప్పటం సరికాదన్నారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని మానుకోవాలని ప్రజలు కూడా దీనిని నమ్మరాదని కృష్ణప్రసాద్ కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెన్షన్ డబ్బులు ఇంటివద్ద కొచ్చి ఇవ్వాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పెన్షన్ విధానానికి, వలంటీర్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మాత్రమే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టారన్నారు. కావున సచివాలయాల ద్వారా పంపిణీ చేయించాలని కోరారు. వేసవి తీవ్రతకు తట్టుకోలేక, వరుసలో నిలబడలేక సచివాలయాల వద్ద పడిగాపులు కాయలేక ప్రజలు ఇబ్బందులు పడుతారు కాబట్టి ఇంటికే పెన్షన్ పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాథరెడ్డి, రమేష్, దొప్పలపూడి రామ్మోహనరావు తదితరులు ఉన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(గురువారం)
సహారీ (ఉదయం) 4.43 (శుక్రవారం)



కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ

దిక్సూచి
DIKSUCHI

జిప్‌మ్యాట్



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్‌గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

జిప్‌మ్యాట్ వివరాలు: దీనిని సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/JIPMAT/

డిప్లొమాలు

సీఐటీడీ

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ)- డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు పదిహేను నుంచి పందొమ్మిదేళ్ల మధ్య ఉండాలి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

- నాలుగేళ్ల డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్ (డీటీడీఎం)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (డీఈసీఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్ (డీఏఆర్ఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ (డీపీఈ)
- **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి నిర్దేశిత డాక్యుమెంట్స్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 26
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.citdindia.org

ఎన్ఐఏఎంటీ



రాంచీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ(ఎన్ఐఏఎంటీ)-అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.3000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఈ/బీటెక్/డిప్లొమా(ఆటోమొబైల్/ మెకానికల్/ మెటలర్జికల్/ మాన్యుఫాక్చరింగ్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్)/బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీ, పుణె, రాంచీ
- **రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** www.niamt.ac.in

డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో జాయింట్ ప్రోగ్రామ్

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ (ఎంఎస్‌డీఎస్ఎం)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఆన్‌లైన్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు అనుకూలంగా ఉంటుంది. రెగ్యులర్ అభ్యర్థులు, విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. జాతీయ పరీక్ష స్కోర్/సంస్థ నిర్వహించే డీమ్యాట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్/బీఫార్మసీ/బీఆర్క్/బీడిజైన్/బీఎఫ్‌టెక్/నాలుగేళ్ల బీఎస్సీ /ఎమ్మెస్సీ/ఎంసీఏ/ఎంబీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గత మూడేళ్లలో నిర్వహించిన క్యాట్/గేట్/జీమ్యాట్/జీఆర్ఈ/జామ్ పరీక్షల్లో ఒకదానిలో అర్హత పొంది ఉండాలి. లేదంటే ఐఐటీ ఇండోర్ నిర్వహించే డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీమ్యాట్) 2024 రాయాల్సి ఉంటుంది.

డీమ్యాట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం 90 నిమిషాలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 10 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **డీమ్యాట్ 2024 తేదీ:** జూన్ 23
- **వెబ్‌సైట్:** msdsm.iiti.ac.in, msdsm.iimi.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8NYYasZలో చదవండి.

మీ ఫ్యామిలీకి ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ ఇది



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు ఈ సినిమాను నిర్మించారు. మంగళవారం రాత్రి దూలపల్లి మైసమ్మ గూడలోని కాలేజ్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది. విజయ్ ఇప్పటివరకూ చేసిన నటన ఒక ఎత్తయితే, ఇందులో ఇచ్చిన పెర్ఫార్మెన్స్ మరో ఎత్తు. అలాగే మృణాళిని కూడా అద్భుతంగా నటించింది. బ్లడ్ అండ్ సోల్ పెట్టి ఈ సినిమా చేశాను. దిల్‌రాజుగారి బేనర్‌లో వర్క్ చేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది' అన్నారు.

'మీరంతా ఎగ్జామ్స్ రాసి పాసయిన తర్వాత నెక్స్ట్ క్లాస్‌లోకి వెళ్లడమే కాదు ఈ సినిమా చూసి ఫ్యామిలీ స్టార్స్ అవుతారు. ఈ సినిమాలో విజయ్ నటన అమ్మాయిలకు బాగా నచ్చుతుంది. అతని పాత్రను దర్శకుడు పరశురామ్ బాగా డిజైన్ చేశాడు. నవ్విస్తాడు, ఫైట్స్ చేస్తాడు. కోపం వస్తే కొట్టమని హీరోయిన్‌తో తన్నులు తింటాడు. మీరందరూ కూడా బాగా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు దిల్ రాజు.

హీరోయిన్ మృణాళిని మాట్లాడుతూ 'ఇందు పాత్ర పోషించడం మొదటి 15 రోజులు చాలా కష్టంగా అనిపించింది. ఆ తర్వాత ఆ పాత్రను నా కంటే గొప్పగా ఎవరూ చేయలేరన్న సంతోషం కలిగింది. 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని మా ఫ్యామిలీ స్టార్ అయిన నాన్నకు అంకితం ఇస్తున్నా' అన్నారు. 'ఆరేళ్ల క్రితం నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ 'గీత గోవిందం'. అదే దర్శకుడితో 'ఫ్యామిలీ స్టార్' చేశా. నా సినిమా రూ.వంద కోట్లు వసూలు చేయాలనే కల ఆ సినిమాతో తీరింది. మళ్లీ అటువంటి సినిమా నాకు రాలేదు. 'పెళ్లిచూపులు' నుంచి 'ఫ్యామిలీస్టార్' దాకా నేను చేసిన ప్రతి సినిమా ఏదో ఒక కొత్త విషయం నేర్పించింది. ఇబ్బందులు, అవరోధాలు, అవమానాలు ఎదురైనా వాటిని దాటుకుని అనుకున్నది సాధించాలి. అదే నమ్మకంతో నేను పనిచేస్తుంటా. మీ ఫ్యామిలీకి మా టీమ్ ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ 'ఫ్యామిలీ స్టార్'. చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు విజయ్ దేవరకొండ.

ఆ కోరిక గీతాంజలితో తీరింది



అందాల నటి అంజలి నటించిన 'గీతాంజలి' చిత్రం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సినిమాస్ సంస్థతో కలిసి కోన వెంకట్ నిర్మించారు.ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కోన వెంకట్ మాట్లాడుతూ 'ఒక తెలుగు అమ్మాయి 50 సినిమాలు చేయడం చాలా గొప్ప విషయం. అందుకే అంజలిని అభినందించాలి. ఆమెకు ఇది 50వ సినిమా. ఈ చిత్రానికి నేను కథ ఇచ్చినా దాన్ని పది మెట్లు ఎక్కించి ముందుకు తీసుకువెళ్లారు భాను, నందు. స్క్రిప్ట్‌లో ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. దర్శకుడు శివకు ఇది బెస్ట్ మూవీ అవుతుంది' అన్నారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ 'నా 50వ సినిమా చాలా స్పెషల్‌గా ఉండాలనుకున్నాను. ఆ కోరిక 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రంతో తీరింది. అందరినీ ఎంటర్‌టైన్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాం. కామెడీ, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ చేసిన చిత్రమిది. 'గీతాంజలి' కంటే వంద రెట్లు బాగుంటుంది' అని చెప్పారు సినిమా ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందనీ, అంతకు మించి సినిమా ఉంటుందని దర్శకుడు శివ చెప్పారు. ఈ చిత్రంలో తను చెనక్కాయల శీను పాత్ర పోషించాననీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. 'గీతాంజలి' కంటే ఈ చిత్రం మరింత భయపెడుతుంది, నవ్విస్తుంది అని సత్యం రాజేశ్ తెలిపారు.

కల్ట్ లవ్‌స్టోరీ



దర్శకుడు నక్కిన త్రినాథరావు తన సొంత చిత్రనిర్మాణ సంస్థ నక్కిన నేరేటివ్స్‌లో నిర్మించే రెండో సినిమా షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. పలు సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన విక్రమ్ సహిదేవ్ లగడపాటి హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో 'దృశ్యం' చిత్రంలో వెంకటేశ్ కుమార్తెగా నటించిన ఎస్తేర్ అనిల్ హీరోయిన్‌గా చేస్తున్నారు. వీరిద్దరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత శరత్ మరార్ కెమెరా స్విచాన్ చేయగా, హీరో సందీప్‌కిషన్ క్లాప్ ఇచ్చారు. సుమంత్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ 'ఇది కల్ట్ లవ్ స్టోరీ. టౌన్‌లో జరిగే అందమైన ప్రేమకథ. ఇందులో విక్రమ్ పాత్ర అదిరిపోతుంది. ఎస్తేర్ లో మంచి ప్రతిభ ఉంది. తారక్ పొన్నప్ప కీలక పాత్ర పోషిస్తున్నారు' అని చెప్పారు. ఎవరూ ఊహించని జానర్‌లో ఈ సినిమా ఉంటుంది అని దర్శకుడు వంశీకృష్ణ మల్ల చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MxpRMdS లో చదవండి.

తెనాలిలో పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా

● నిరుత్సాహానికి గురైన పార్టీ నేతలు, అభిమానులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడిందని, పర్యటన మళ్ళీ ఎప్పుడు జరిగేది త్వరలో ప్రకటిస్తామని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలి మార్కెట్ సెంటర్‌లో పవన్‌కల్యాణ్ సభ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జ్వరం కారణంగా రాలేకపోయారని అభిమానులు నిరుత్సాహానికి గురి కావద్దని కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పవన్‌కల్యాణ్ పర్యటన ఖరారు చేశారు. సుల్తానాబాద్ వద్ద హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు సభలో పాల్గొనేందుకు వారాహి వాహనం కూడా మంగళవారం రాత్రి తెనాలి చేరుకుంది. పర్యటన వాయిదా పడటంతో జనసేన నేతలు, కార్యకర్తలు నిరాశకు గురి చేసింది.

వలంటీర్ల రాజీనామా వెనుక వైసీపీ కుట్ర

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఏప్రియల్ 3: రాష్ట్రంలో అర్హులైన పెన్షన్‌దారుల సొమ్ము వేల కోట్ల రూపాయలను పక్కదారి పట్టించి పెన్షన్‌ల పంపిణీలో జగన్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారులు మాత్రం 3వతేదీ నుంచి పింఛన్‌లు ఇస్తామంటూ దానికి తగిన ఆదేశాలను జారీ చేశారని, కానీ అవి తమకు అందకపోవడంతో పింఛన్‌దారులు నిరాశతో వెనుతిరిగి వెళ్లారని అన్నారు. పింఛన్‌దారుల్లో వ్యతిరేకత తీసుకురావటానికి జగన్మోహన్‌రెడ్డి కుటిల రాజకీయాలు ఆడుతున్నారన్నారు. సచివాలయ సిబ్బంది 11మంది ఉంటే పెన్షన్‌లను ఇంటింటికి తీసుకుని వెళ్ళి ఇవ్వలేని పరిస్థితి నెలకొందంటూ ప్రశ్నించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ళ వద్దనే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వలంటీర్ల చేత జగన్మోహన్‌రెడ్డి మూకుమ్మడి రాజీనామాలు చేయిస్తూ వారి చేత ఓటర్లపై బెదిరింపులకు దిగుతూ ప్రజలను అయోమయంలో నెట్టేందుకు చూస్తున్నారన్నారు. తమకు వలంటీర్లు అంటే గౌరవం ఉందని, అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరించరాదని సూచించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను రద్దు చేసే పనిలేదని కొనసాగిస్తామని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా తప్పుడు కార్యక్రమాలు చెయ్యనిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

పింఛన్ల పంపిణీ కుట్రలు మానండి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3: వైసీపీ రాజకీయ కుట్రలు మాని పింఛన్లు ఇళ్ళవద్ద పంపిణీ చేయాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇదే విషయం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి దృష్టికి తీసుకెళ్ళామని, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా వారి ఇళ్ళ వద్దకే పింఛన్లు ఇవ్వాలని కోరామన్నారు. కావాల్సినంతమంది సచివాలయ సిబ్బంది ఉండి, ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేసే అవకాశం ఉన్నా జగన్‌రెడ్డి ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా వృద్ధులు, దివ్యాంగుల్ని ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీకి లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్రామల వారీగా పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారని జీవీ ఆంజనేయలు తెలిపారు.

విద్యాభివృద్ధికి ఎంపీ లావు కృషి భేష్

● ప్రైవేటు పాఠశాలల యజమానులతో రత్తయ్య భేటీ

పిడుగురాళ్ళ, ఏప్రిల్3: పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి విద్యాసంస్థలతో పాటు పార్లమెంట్ అభ్యర్థిగా తన కుమారుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంతో కృషిచేశారని విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య అన్నారు. బుధవారం ఆయన పిడుగురాళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి యాజమాన్యాలతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. రత్తయ్యతో పాటు రుద్రమదేవి కూడా విద్యాసంస్థల యాజమాన్యాలతో భేటీ అయి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరింపజేస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలుకు, గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుల గెలుపునకు సహకరించాలని విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను కోరారు.

ప్రజా ప్రయోజనాలే కూటమి లక్ష్యం

● గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని

● కూటమి నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరుసిటీ, ఏప్రిల్ 3: 'బీజేపీ ఒక బలమైన భావజాలం నుంచి ఉద్భవించిన పార్టీ. దేశ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఎన్డీఏ కూటమి ఏర్పడింది.' అని గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్ నందు బీజేపీ, టీడీపీ పశ్చిమ నియోజకవర్గం ముఖ్య నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమన్వయ సమావేశం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థిని పిడుగురాళ్ల మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ స్వచ్ఛభారత్, మేకింగ్ ఇన్ ఇండియా వంటి నిర్ణయాలు, అమలు నరేంద్రమోదీ వచ్చిన తర్వాతే సాధ్యమ య్యాయని ప్రశంసించారు. చంద్రబాబునాయుడుకు ఏపీ అంటే రెండు కళ్ళు అని 'ఏ'అంటే అమరావతి 'పీ'అంటే పోలవరం అని, కానీ జగన్‌కు మాత్రం ఏ అంటే ఆపడం 'పీ' అంటే పడగొట్టడం మాత్రమేనని పెమ్మసాని ఎద్దేవాచేశారు. గుంటూరు పశ్చిమ అభ్యర్థిని పిడుగురాళ్ల మాధవి మాట్లాడుతూ నేడు భారతదేశం ఉన్నతస్థితిలో ఉండడానికి నరేంద్ర మోదీనే కారణం అని అన్నారు. కూటమి నేతల గెలుపునకు నేతలు, కార్యకర్తలంగా సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, మాజీ మంత్రి శనక్కాయల అరుణ ప్రసంగించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, సీనియర్ నాయకులు యడ్లపాటి రఘునాథబాబు, గుంటూరు పార్లమెంట్ సంయోజక్ భీమినేని, చంద్రశేఖర్, కొక్కెర శ్రీనివాస్, టీవీ రావు గుంటూరు టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, తాళ్ల వెంకటేష్ యాదవ్, డేగల ప్రభాకర్, డాక్టర్ నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలు జగన్ వలలో చిక్కుకోవద్దు

● నూర్‌బాషాల ఆత్మీయ సమావేశంలో లావు, జీవీ, షరీఫ్



షరీఫ్, శ్రీకృష్ణదేవరాయులు, జీవీ, మక్కెనలను సత్కరిస్తున్న ముస్లింలు

వినుకొండ, ఏప్రిల్ 3 : ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న సీఎం జగన్‌రెడ్డి వలలో ముస్లింలు చిక్కుకోవద్దని శాసన సమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు విజ్ఞప్తి చేశారు. విభజించి పాలించాలని చూస్తున్న వైసీపీ కుయుక్తులపై అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. వినుకొండలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం ముస్లిం నూర్‌బాషాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి షరీఫ్ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్‌లను లోకసభ, రాజ్యసభలో బలపరిచిందని వైసీపీ కాదా అని ఆయన ప్రశ్నించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆయనను ఒప్పించి కలాంను రాష్ట్రపతిగా చేసిన చంద్రబాబుకు, జగన్‌కు మధ్య ఇక్కడ తేడా గమనించవచ్చన్నారు. బీజేపీతో ఉన్నప్పుడు హైదరాబాద్ హజ్‌హౌస్ నిర్మించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కడప, విజయవాడలో హజ్‌హౌస్‌లు నిర్మించడానికి రూ.70 కోట్లతో శంకుస్థాపన చేస్తే ఆ డబ్బును వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళించి వాడుకుందని మండిపడ్డారు. టీడీపీ ఎప్పటికీ లౌకికే పార్టీనే అన్న షరీఫ్ ముస్లింల ధార్మిక ఇస్లామిక్ విషయాల్లో ఎవరైన జోక్యం చేసుకుంటే వ్యతిరేకించి తీరుతామన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ ప్రాంతానికి బొల్లా బ్రహ్మనాయుడు ఈ ఐదేళ్ళలో రూ.300 కోట్ల నిధులు తీసుకువస్తే తాను ఐదేళ్ళలో రూ.2600 కోట్లు తీసుకువచ్చానన్నారు. ముస్లీం షాదిఖానాలకు నిధులు అందిస్తామన్నారు. మర్కస్ మసీదు నిర్మిస్తుంటే చంద్రబాబుతో పాటు రూ.28 లక్షలు తీసుకువచ్చినట్లు తెలిపారు. తాను వ్యక్తిగతంగా మరో రూ.11లక్షలు అవసరమైన సిమెంట్ ఇచ్చామన్నారు. ఈద్గా మదర్సాల కోసం ఆర్థికసాయం చేసినట్లు వివరించారు. పేద ముస్లిం విద్యార్థుల చదువు కోసం ఉపకార వేతనాలు ఇచ్చామన్నారు. నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ నీతినిజాయితీకి నిలువుటద్దంగా నిలబడిన షరీఫ్ బాటలోనే ముస్లిం సమాజం నడవాలని విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో అమరావతి బిల్ విషయంలో మనస్సాక్షి ఖురాన్ విలువల మేరకు షరీఫ్ నిలబడ్డారని, అలాంటివ్యక్తి అందరికి ఆదర్శమన్నారు. ముస్లిం రిజర్వేషన్‌పై న్యాయపోరాటంలో టీడీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీఏఏకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏ ఒక్క ముస్లింకు ఎలాంటి ఇబ్బంది జరగదన్నారు. ఎన్‌ఆర్‌సీ దేశ ప్రజలందరికి ఒకేలా వర్తిస్తుందన్నారు. సీఏఏ బిల్లుకు వైసీపీలో ఉన్న అందరు ఓటువేసినా నేను ఓటు వేయకుండ బయటకు వచ్చానని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను, నూరుబాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ముఖ ద్వారం

తగ్గిన విద్యుదుత్పత్తి

● ఏడాదిగా ఒక మిలియన్ యూనిట్ లోపే ..

రెంటచింతల,ఏప్రిల్ 3: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. సరైన వర్షాలు లేకపోవడంతో విద్యుదుత్పత్తిలో టార్గెట్‌ను కూడా చేరుకోలేకపోయారు. 50 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి రెండు టర్బయిన్లను ఏర్పాటు చేశారు. 2017 జనవరి 9న విద్యుత్ ఉత్పత్తిని ఆరంభించారు. అప్పటి నుంచి రికార్డుస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని చేసి అవార్డులు అందుకున్నారు. ఈఏడాది మార్చి 31నాటికి కేవలం 7284 ఎంయుల విద్యుత్ మాత్రమే తయారైంది. 2021-22లో 137.67 ఎంయులు, 2022-23లో 98.1246 ఎంయు(మెగాయూనిట్లు)ల విద్యుత్ తయారైంది. ప్రాజెక్టు ఆరంభం నుంచి ఇప్పటివరకు 473.47 ఎంయుల విద్యుత్ తయారైంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7టీఎంసీల నీరుంది.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



వృద్ధుడి మృతదేహం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 3: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు నరసరావుపేట రెండవ పట్టణ సీఐ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1న ఓ గుర్తు తెలియని వ్యక్తి పల్నాడు రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద స్పృహ తప్పి పడి పోయి ఉన్నాడని, 108 అంబులెన్స్ సిబ్బంది బాధితుడిని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ ఈనెల 2వ తేదీన చనిపోయాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో

వైసీపీ నేతలపై ఏఆర్వో ఫిర్యాదు

● ఎమ్మెల్యే రోశయ్య, నూరిఫాతిమాతో పాటు మరికొందరిపై కేసు

పెదకాకాని, ఏప్రిల్ 3: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని మద్దిరాల కాలనీ, బసవతారకరామనగర్, మంగళదాస్‌నగర్‌లలో అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించిన గుంటూరు పార్లమెంటు వైసీపీ సమన్వయకర్త, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యపై, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా, ఎమ్మెల్యే ముస్తఫా పీఏ షేక్ మస్తాన్‌వలి, 57వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు నూర్‌లపై పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది. గతనెలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. దీనిపై గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్-1, తూర్పు నియోజకవర్గ ఏఆర్వో వెంకటలక్ష్మి పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెదకాకాని పోలీసులు ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్టుగా ఆ నలుగురితోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

ఇద్దరు వలంటీర్లు సస్పెన్షన్

● ఎన్నికల ప్రచారంల్లో పాల్గొన్నందుకు అధికారుల చర్యలు

కారంపూడి, ఏప్రిల్ 3: మండలంలోని కాచవరం గ్రామానికి చెందిన వలంటీర్లు ముప్పల రాజశేఖర్‌రెడ్డి, షేక్ యూసఫ్‌బాషాలను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాజశేఖర్‌రెడ్డి, యూసఫ్‌బాషాలు పాల్గొన్నట్లు తమ విచారణలో తేలడంతో, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారిని విధులు నుంచి తొలగించామని అన్నారు.

వలంటీర్ల రాజీనామాలు

వేమూరు, ఏప్రిల్ 3: మండల కేంద్రమైన వేమూరులోని రెండు సచివాలయాల పరిధిలో 23 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. సచివాలయం1 పరిధిలో 22 మంది ఉండగా వారిలో 9 మంది, సచివాలయం 2 పరిధిలో 21 మంది గాను వారిలో నలుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను అందజేయగా, వాటిని ఈఎస్‌డబ్ల్యూఎస్‌కు పంపడంతో పాటు సంబంధిత నివేదికలను కలెక్టర్‌కు పంపామన్నారు.

కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల సచివాలయం - 2లో వలంటీర్లుగా పనిచేస్తున్న మొగిలి వెంకట్రావు, ఇరిగిడెండ్ల మరియమ్మ, కాంద్రకొండ వీరేశ్వరరావు, అంబేపల్లి శివనాగరాజు, చీమలదిన్నె చిన వెంకయ్యలు బుధవారం తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి అందించారు.

వట్టిచెరుకూరు: మండలంపరిధిలోని గారపాడు, చింతపల్లిపాడు, కుర్నూతల గ్రామ పంచాయతీల పరిధిలో 25 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా, ఆయా పత్రాలను సచివాలయ సెక్రటరీలకు అందజేశారు. ఆమూడు పంచాయతీలు వైసీపీ పాలకవర్గం నిర్వహణలో ఉండటం గమనార్హం. ఈ విషయంపై ఎంపీడీవో శేషగిరిరావు స్పందిస్తూ వలంటీర్లు రాజీనామా చేసిన మాట వాస్తవమేనని, ఆ యా పత్రాలు తన వద్దకు రాగానే ఆమోదిస్తూ వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఉత్తర్వులు జారీచేస్తానని స్పష్టం చేశారు.

మాచవరం : మండలంలోని తురకపాలెం గ్రామంలో బుధవారం 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఆ సచివాలయ పరిధిలో మొత్తం 15 మంది వలంటీర్లు ఉండగా, వారిలో 10 మంది వలంటీర్లు రాజీనామాచేసి ఆయా పత్రాలను అందజేసినట్లు ఎంపీడీవో సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీ నామా ఆయా వలంటీర్లు వారి రాజీనామా పత్రాల్లో పేర్కొన్నట్లు ఎంపీడీవో సురేష్ వివరించారు.

అంబటి ప్రచారంలో వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్



పాకాలపాడు గ్రామంలో అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీరు ఈపూరి కృష్ణారెడ్డి

సత్తెనపల్లి, ఏప్రిల్ 3 : సత్తెనపల్లి వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వలంటీర్లు పాల్గొంటున్నారు. మంగళవారం కట్టావారిపాలెంలో నిర్వహించిన రాంబాబు ఎన్నికల ప్రచారంలో ఆ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గుంటగాని తిరుపతిరావు పాల్గొన్నారు. అలాగే బుధవారం సత్తెనపల్లిమండలం పాకాలపాడులో జరిగిన అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారంలో ఆ గ్రామా నికి చెందిన వలంటీర్లు ఈపూరి కృష్ణారెడ్డి, బూతు కూరి స్వాతి పాల్గొన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రచారంలో పాల్గొనటంపై పలువురు చర్చించుకుంటున్నారు.

ఐదేళ్లలో రాష్ట్రం వెనుకబాటు

● 1569వ రోజుకు రైతుల ఆందోళనలు



తుళ్ళూరులో నినాదాలు చేస్తున్న పలువురు రైతులు, మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 3: గత ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల అయినా రాజధాని అమరావతిని నిర్మించలేక పోయింది.. మన ప్రభుత్వం వచ్చిన తరువాత అమరావతిని బ్రహ్మాండంగా కడదామని సీఎం జగన్‌రెడ్డి చెప్పటాన్ని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు గుర్తుచేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1569వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడతూ, జగన్‌రెడ్డి తన పరిపాలనా లోపాన్ని కప్పిపుచ్చుకోవటానికి మూడు రాజధానులని ప్రజల దృష్టిని మరల్చారన్నారు. పాలన చేత కాని ముఖ్యమంత్రి అప్పుడే రాజీనామా చేయాల్సిందన్నారు. ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనకబాటుకు గురి చేశారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలల్లో ఇళ్ల వద్ద నుంచి, శిబిరాల నుండి రైతులు మహిళలు ఆందోళనలు కొనసాగాయి.



బీసీ డిక్లరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రభుత్వం రాగానే బీసీలకు రక్షణ చట్టం

● జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్3: ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకు వస్తామని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ఉప ప్రణాళిక ద్వారా వారి నిధులు వారి సంక్షేమానికే ఖర్చు చేస్తామని, బీసీల రక్షణకు నిబద్ధతతో పని చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే హామీ ఇచ్చారన్నారు. పట్టణంలోని 10వ క్లస్టర్ పరిధిలోని సుబ్బయ్యతోటలో జయహో బీసీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ పాలనలో బీసీ ఉప ప్రణాళిక ద్వారా రూ.50 వేల కోట్లు బీసీ కార్పొరేషన్‌లు, ఫెడరేషన్‌ల ద్వారా రుణాలు అందించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను వంచించిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికీ కులాల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపు కోవాలని చూస్తున్నారన్నారు. పైగా 74 మంది బీసీ నాయకులను క్రూరంగా నరికి చంపిన జగన్ ముఠా మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో జనం లేరన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను టీడీపీ కూటమి కార్యకర్తలంతా ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళాలని ప్రత్తిపాటి సూచించారు. అనంతరం పలువురు వైసీపీ శ్రేణులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరగా వారికి ప్రత్తిపాటి పుల్లారావు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోకవర్గంలో టీడీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని ప్రత్తిపాటి సూచించారు.



ఉత్తమ పరిశోధన పత్రం సమర్పించిన వారికి మెమెంటో అందజేస్తున్న వీసీ జయలక్ష్మీదేవి

సాంకేతిక ఆవిష్కరణలకు సదస్సులు తోడ్పాటు

● వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి

● బాపట్ల వ్యవసాయ కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు

బాపట్ల, ఏప్రిల్ 3: విద్యార్థుల సాంకేతిక అభివృద్ధికి సదస్సులు తోడ్పడుతాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో రెండురోజుల జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. జాతీయస్థాయి శాస్త్ర, సాంకేతిక సదస్సు ముగింపు కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి వ్యవసాయ విద్యార్థులకు వ్యవసాయరంగంలోని శాస్త్ర, సాంకేతికత పట్ల అవగాహన పెంపొందించేందుకు అనేక అవకాశాలున్నాయన్నారు. వాటిని అనుసరించటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని ఆమె తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ దిశగా రైతులు ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చుకోవాలనే అంశంపై ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సదస్సును బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరుపుకోవటం సంతోషదాయకమన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన యూనివర్సిటీ పీజీడీన్ డాక్టర్ ఏవీ.రమణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్‌మేనేజర్ సయ్యద్ జవహర్, డైరెక్టర్ ఆఫ్ విస్తరణా విభాగం డాక్టర్ కె.ఎస్.ఎస్.నాయక్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణసాగర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన పరిశోధన పత్రాలను, పోస్టర్‌లను సమర్పించారు. ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్‌లు, మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ సాయిరాంకుమార్, విద్యార్థి విభాగ ఆర్గనైజింగ్ సెక్రటరి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైల్వే సీనియర్ డీవోఎం దినేష్‌కుమార్

సరుకు రవాణాలో రికార్డు ఆదాయం

● అభినందన సభలో డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల సమష్టి కృషితోనే సరుకు రవాణాలో రికార్డు స్థాయిలో రూ.395.8 కోట్ల ఆదాయాన్ని గత వార్షిక సంవత్సరంలో సాధించడం జరిగిందని గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ అమరావతి ఎనెక్స్‌లో జరిగిన అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ డీవోఎం ఎం.దినేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ అధికారులు, కార్మికుల సమన్వయంతో ఎలాంటి లోపాలకు తావులేకుండా పక్కా ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. వివిధ వ్యాపారసంస్థల భాగాస్వామ్యాన్ని ప్రోత్సహించి తక్కువ సమయంలో సరుకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, రైల్వే అధికారులు, ఉద్యోగులు, ఆపరేటింగ్, కంట్రోలర్స్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

1,09,377 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,11,752 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,09,377 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 85,603 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	19000
నెంబరు. 5	9000	17000
273	10000	14500
341	9000	17000
4884	9000	14000
సూపర్ 10	12000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	9000	18000
తెల్లకాయలు	5000	11500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



పెన్షన్ కోసం వేచి ఉన్నవారితో మాట్లాడుతున్న నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్

చేసిన ప్రగతి గురించి చెప్పుకోవటానికి లేక టీడీపీపై విమర్శలు

● కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్

బాపట్ల, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో గడిచిన ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ప్రజలకు చేసిన ప్రగతి గురించి చెప్పుకోవటానికి ఏమిలేక తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పెన్షన్ రాకుండా చేస్తున్నారని వైసీపీ మూకలు విమర్శలు చేస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని భీమావారిపాలెం సచివాలయం వద్ద పెన్షన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులను బుధవారం వారు పలకరించారు. పెన్షన్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ నుంచి ఇంకా డబ్బులు రాలేదని వచ్చిన వెంటనే ఇస్తామని సచివాలయ సిబ్బంది చెప్పినట్లు లబ్ధిదారులు తెలిపారు. దీనిపై నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులను అడ్డుపెట్టుకొని టీడీపీపై దుష్ప్రచారాలు చేయటాన్ని మానుకోవాలని వైసీపీని హెచ్చరించారు. పెన్షనర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సచివాలయ సిబ్బందితో ఇంటికి తీసుకెళ్ళి ఇవ్వాలని తాము కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు పెన్షన్‌ల విషయమై ఎన్నికల కమిషన్‌తో, చీఫ్ సెక్రటరీతో మాట్లాడి పెన్షన్లు సజావుగా లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరినట్లు తెలిపారు. రెండు నెలలు తర్వాత తెలుగుదేశం అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే వచ్చి రూ.4 వేల చొప్పున పెన్షన్ ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.

నేటి నుంచి వేగేశన నరేంద్రవర్మ ప్రచారం ప్రారంభం

బాపట్ల రూరల్, ఏప్రిల్ 3 : రానున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గురువారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక భావన్నారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొని, అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అప్పికట్ల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలు నుంచి 32, 33, 34 వార్డులలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ముందుగా 34వ వార్డు కంకటపాలెం రోడ్డు నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఉపవాసదీక్షపరులైన ముస్లింలకు ఇఫ్తార్ విందు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 3 : ఉపవాసదీక్షపరులైన ముస్లింలకు అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. చందోలు పాత సంత బజార్ కూడలిలో బుధవారం సాయంత్రం ఉపవాసదీక్షాపరులైన ముస్లింలకు చందోలు గ్రామ ముస్లిం యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని దీక్షాపరులకు వడ్డించారు. తొలుత స్థానిక మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ముస్లిం మతపెద్దలు, ముస్లింలతో కలిసి నమాజ్‌లో పాల్గొన్నారు. వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ మానవాళికి శాంతిని బోధించి మంచిని, మానవత్వాన్ని ఇస్లాం మతం పంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్‌ఖాసిం, మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ జునేద్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్‌రజాక్, చందోలు గ్రామ టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం, సీనియర్ టీడీపీ నాయకులు సయ్యద్ సైదా, అబ్దుల్ హక్, సలీంబేగ్, మండల మైనార్టీ నాయకులు షేక్ మీరా, ఎం.ఎస్. నియాజి, అతావుర్ రహమాన్, మండల తెలుగు మహిళా అధ్యక్షులు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు గోకరాజు శ్రీధర్ వర్మ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, మోదుగుల శంకరరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

ఇస్లాంపేట, కొత్తపేటలో ప్రీస్కూల్ సంసిద్ధత

బాపట్ల, ఏప్రిల్ 3 : పట్టణంలోని 30వ వార్డు ఇస్లాంపేట, కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సీబీఈవెంట్‌లో భాగంగా ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త సయ్యద్ కరీమున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీడీపీవో బి.శైలజ, సూపర్‌వైజర్ శేషుకుమారి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలతో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించి ప్రీస్కూల్ సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్వపు ప్రాథమిక విద్యను ఆటపాటలతో అందించటంతోపాటు పౌష్టికాహారం పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీలలో చేర్పించాలని సీడీపీవో కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సయ్యద్ కరీమున్నీసా, వై.పార్వతి, ఎ.భాగ్యలక్ష్మి, ఆయా కె.ఏమేలమ్మ, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న సీడీపీవో శైలజ, సూపర్‌వైజర్ శేషుకుమారి తదితరులు

పెన్షన్ పంపిణిలో వైసీపీ నాయకుల దుష్ప్రచారం : మక్కామల

బాపట్లటౌన్, ఏప్రిల్ 3 : వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పంపిణీ చేసే పెన్షన్‌ల విషయంలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు దుర్దేశ పూర్వకంగా టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మక్కామల శివ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వలంటీర్లలో కొంతమంది అధికార వైసీపీ కార్యకర్తలుగా ఉండి టీడీపీపై అనవసరమైన పేలాపనలు సృష్టించటం సరికాదన్నారు. తెలుగుదేశం పెన్షన్ల పంపిణికి వ్యతిరేకం కాదని పేదల మనసులలో ఎప్పుడూ టీడీపీ ఉంటుందన్నారు. వలంటీర్లు కొంతమంది వృద్ధులు, వితంతువులకు టీడీపీయే పెన్షన్ల పంపిణీ నిలుపుదల చేసిందని చెప్పటం సరైన విధానం కాదని ముక్కాముల శివ అన్నారు.

ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

బాపట్లరూరల్, ఏప్రిల్ 3 : ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి తన ఇంటిపై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం పడమరబాపట్ల పంచాయతీ మహాత్మాజీపురం గ్రామానికి చెందిన పి.సంజీవరావు (50) తన ఇంటిపై ఉన్న వస్తువుల కోసం వెళ్ళి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియావైద్యశాలకు తరలించటం జరిగిందని పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పెరిగిన వైసీపీ కక్ష సాధింపు చర్యలు

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు ఏప్రిల్ 3 : ప్రశాంతమైన గ్రామాల్లో వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి హింసా రాజకీయాలకు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. బుధవారం చుండూరులో సీనియర్ తెలుగుదేశం నాయకుడు, డీసీసీబీ మాజీ సభ్యుడు గూదేటి బ్రహ్మారెడ్డి విగ్రహానికి దుండగులు మంగళవారం రాత్రి నిప్పు పెట్టారు. ఈ సంఘటన తెలుసుకున్న ఆనందబాబు గ్రామానికి వచ్చి విగ్రహాన్ని పరిశీలించి కార్యకర్తలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి హింసా రాజకీయాలు పెచ్చరిల్లిపోయాయని, వివిధ వర్గాల మధ్య రాజకీయ కక్షలు ప్రేరేపించి నాయకులు చలిమంటలు కాసుకుంటున్నారని ఆనందబాబు తెలిపారు. మండలంలో చురుకైన తెలుగుదేశం నాయకుడుగా మన్ననకెక్కిన గూదేటి బ్రహ్మారెడ్డి విగ్రహానికి నిప్పు పెట్టడం కలచి వేసిందన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి చిరస్మరణీయుడుగా ఘనతకెక్కాడు. అలాంటి వ్యక్తి విగ్రహానికి కావాలని గ్రామాల్లో కక్షలు పెంపొందించడానికి ఈ పనికి పాల్పడ్డారు. ఈ ప్రాంతం ఎన్నికల వరకే పార్టీల గ్రూపులు ఉంటాయని, ఎన్నికల అనంతరం అన్నదమ్ముల్లా కలిసిపోతారు. అలాంటి ఈ నియోజకవర్గంలో దండుపాళ్యం బ్యాచ్ ఇటీవల చొరబడింది. ఇటీవల కొల్లూరు మండలంలో యువకుల మధ్య జరిగిన గొడవను కులాల కుంపటిగా చేశారు. ఈ మధ్య భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో ఇక్కడి వైసీపీ తరపున నిలబడుతున్న అభ్యర్థి విలేకర్లపై దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కునే పరిస్థితి, అదేవిధంగా నియోజకవర్గ ఎన్నారైలను బెదిరించిన సంఘటనలు జరిగాయి. రైతులు, కౌలు రైతుల మధ్య గొడవలు సృష్టించడం, ఎస్టీలను రెచ్చగొట్టడం వంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. ఇప్పుడు బ్రహ్మారెడ్డి విగ్రహానికి నిప్పు పెట్టడం కూడా హింసను ప్రోత్సహించినట్లేనని ఆనందబాబు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా యథేచ్ఛగా హింసా సంఘటనలు జరుగుతున్నాయి. పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. వెంటనే ఈ దుశ్చర్యకు కారకులైనటువంటి వారిని అదుపులోకి కఠినంగా శిక్షించాలని ఆనందబాబు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బ్రహ్మారెడ్డి విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఆనందబాబు తదితరులు

టీడీపీలో చేరిన 15 కుటుంబాలు

అమృతలూరు, ఏప్రిల్ 3: వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. మండలపరిధిలోని తురుమెళ్ళ గ్రామం నుంచి 15 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో బుధవారం చేరారు. మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సమక్షంలో గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో గ్రామం నుంచి అద్దంకి వరప్రసాద్, ముంగర శ్రీకాంత్, మన్నవ రాంబాబు, ప్రసన్నకుమార్, కత్తి సోమశేఖర్, స్వతంత్ర అరుణ్‌కుమార్, జాలాది రమేష్, పెరికలపూడి ఇజ్రాయెల్, సురేష్, ఐజాక్, సూర్య, వంశీ, మనోజ్‌కుమార్,రాజు విజయ్‌ల కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. బేతాళ కిరణ్, నరేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓరుగంటిరెడ్డి కార్పొరేషన్ హామీపై చంద్రబాబుకు కృతజ్ఞతలు

కర్లపాలెం, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో ఓరుగంటిరెడ్లకు ఓరుగంటి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు హామీనిచ్చారని కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి తెలిపారు. గతనెల 31వ తేదీన జరిగిన ప్రజాగళం సభలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడుని కలవగా తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాగానే ఓరుగంటి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామి ఇచ్చారన్నారు. వారికి ఓరుగంటి రెడ్డి తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. చంద్రబాబు నాయుడిని కలిసిన వారిలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, పిట్ల వేణుగోపాల రెడ్డి, కళ్ళం హరినాధరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గన్నారు.



చంద్రబాబుతో వేగేసన, కర్లపాలెం జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంపై ఆలోచనలు పెంపొందించుకోవాలి

బాపట్లటౌన్, ఏప్రిల్ 3 : విద్యార్థులంతా శాస్త్రీ దృక్పథంపై ఆలోచనలు మెరుగు పర్చుకోవాలని కేఎల్ యూనివర్సిటి ప్రొఫెసర్ డాక్టర్ కె.నరసింహరాజు అన్నారు. బుధవారం స్థానిక బాపట్ల ఫార్మసీ కళాశాలలో ఎంటర్‌ప్రెన్నివర్‌షిప్, ఇన్నోవేషన్‌పై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించాలని ప్రతి ఒక్కరు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఉద్యోగావకాశాలను కల్పించే దిశగా ఉండాలన్నారు. అదేవిధంగా జి.శైలేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు భవిష్యత్తులో ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఫార్మారంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. అనంతరం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిఇజికె.మూర్తి అతిధి ఉపన్యాసకులను దుశ్శాలువా, మెమొంటోతో సన్మానించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయత్రి హేచరీస్‌కు సఫారి సర్టిఫికెట్

బాపట్ల, ఏప్రిల్ 3 : బాపట్ల గాయత్రి హేచరీస్‌కు మెరైన్ ప్రొడక్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపెడా)వారు సఫారీ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. మానవ వినియోగానికి అనువైన మత్స్య ఉత్పత్తుల అత్యుత్తమ నాణ్యత, మంచి ఆక్వాకల్చర్ పద్ధతులను అనుసరించి ప్రపంచ వినియోగదారులకు భరోసా ఇవ్వటానికి నాణ్యమైన యాంటీబయోటిక్ రహిత రొయ్యల ఉత్పత్తులను ఎగుమతి చేసినందుకు ఈ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. గాయత్రి హేచరీస్ ప్రతినిధులు యర్రంరాజు రవికుమార్, సాగిరాజు వెంకటరామరాజులకు ఎంపెడా ప్రతినిధి సర్టిఫికెట్ ప్రదానం చేసి అభినందించారు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటాం

● ఓటు వేయలేమని ఫ్లెక్సీ ప్రదర్శించిన వ్యక్తికి తహసీల్దార్ హామీ

కొల్లూరు, ఏప్రిల్ 3 : కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబసభ్యుడికి తహసీల్దార్ పుల్లారావు హామీ ఇచ్చారు. కాలుష్యం వల్ల, తమ ఆరోగ్యాలు దెబ్బతిని పోతున్న పట్టించుకోకపోవడంతో ఓ బాధిత కుటుంబం ఎన్నికల్లో ఓటు వే యలేమంటూ కలెక్టర్ నుద్దేశించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై తహసీల్దార్ స్పందించారు. మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన సనకా రవిని తన కార్యాలయానికి పిలిపించి మాట్లాడగా బాధితులు కొన్ని సంవత్సరాలు గా ఇటుక బట్టీల వల్ల వెలువడుతున్న కాలుష్యంతో తమ ఆరోగ్యాలు పూర్తిగా దెబ్బతినిపోయాయని, దీనిపై పలు మార్లు అధికారులకు లిఖిత పూర్వక అర్జీలు అందించినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో తమ కుటుంబం మనస్తాపానికి గురై ఈ ఫ్లెక్సీ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్‌కు వివరించారు. స్పందించిన తహసీల్దార్ ఇటుక బట్టీ పరిశ్రమ దారులతో చర్చించి కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ మైనింగ్ కాలుష్యం నివారణ శాఖ అధికారులతో కూడా ఈ విషయంపై చర్చిస్తామని అన్నారు.



రవితో మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారావు



వేమూరు మండలం పెరవలి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన వైసీపీ అభ్యర్థి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ వలంటీర్ మోర్ల గోపి - వేమూరు.

ప్రజాహిత పాలన కోసం టీడీపీ అభ్యర్థిని గెలిపించాలి

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, ఏప్రిల్ 3 : ప్రజాహిత పాలన కోసం టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి అయిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబును గెలిపించాలని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు కోరారు. బుధవారం వేమూరులో ఆనందబాబు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ప్రచారంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



మేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తున్న జొన్నలగడ్డ విజయబాబు

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

● ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 3: రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం తథ్యమని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. బుధవారం నగరం మండలం యాదవపాలెంలో నిర్వహించిన శంఖారావంలో టీడీపీ ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ వైసీపీ ప్రజలను మరలా మోసం చేసేందుకు వలంటీర్ వ్యవస్థను అడ్డం పెట్టుకొని కుటిల రాజకీయాలు చేసేందుకు పన్నాగాలు పన్నుతున్నారని ప్రజలు వారి మాటలను నమ్మిమోసపోవద్దని తెలిపారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అండగా నిలిచి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, పీవీ చింతారావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, లుక్కా. గుడారంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



యాదవపాలెంలో శంఖారావంలో భాగంగా కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

డివిజన్‌లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు : ఆర్డీవో

రేపల్లె, ఏప్రిల్ 3 : డివిజన్ పరిధిలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హేలా సోరాన్ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో వేసవిలో తాగునీటి ఎద్దడి వడగాల్పుల కారణంగా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో గ్రామా ల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఉన్న చెరువుల్లో నీటిని నింపుకోవాలని సూచించారు. అవసరమైన చోట చేతి పంపులను ఏర్పాటు చెయ్యాలని లేనిపక్షంలో ట్యాంకర్ల ద్వారానైన తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బందితో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యలు చర్చించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేలా సోరాన్

యడ్లపల్లి గ్రంథాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

చుండూరు, ఏప్రిల్ 3: యడ్లపల్లి శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాధికారి వి.సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక అధికారికి పలు సూచనలు చేశారు. గ్రంథాలయా న్ని సకాలంలో తెరవడంతో పాటు ఎక్కువ మంది పాఠకులు గ్రంథాలయాలకు వచ్చే విధంగా ప్రోత్సహించాలని, విద్యార్థులు, యువతకు గ్రంథాలయాలపై అవగాహన కల్పించాలన్నారు.

కారులో 12 బీరుసీసాలు స్వాధీనం

బాపట్లరూరల్, ఏప్రిల్ 3 : బాపట్ల మండలం చుండూరుపల్లి చెక్ పోస్ట్ వద్ద రూరల్ పోలీసులు ఎన్నికలలో భాగంగా తనిఖీలను నిర్వహిస్తుండగా బుధవారం హైదర్ పేట నుంచి బాపట్ల వైపునకు వస్తున్న ఓ కారులో 12 బీరుసీసాలు లభ్యమవ్వటంతో వాటిని రూరల్ పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసి ఆ వ్యక్తిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అభ్యర్థులు ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 3 : సాధారణ ఎన్నికలలో నామినేషన్ వేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం అయ్యారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ అయినందున ఎస్సీ అభ్యర్థులు మాత్రమే నామినేషన్ వేయాలని, అసెంబ్లీ నియోజకవర్గాలలో వేమూరు ఎస్సీ రిజర్వు అయినందున అక్కడ ఎస్సీ అభ్యర్థుల నామినేషన్‌లు మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు సెక్యూరిటి డిపాజిట్ కింద రూ.25 వేలు చెల్లించాల్సి ఉండగా, ఎస్సీ అభ్యర్థులు 50 శాతం డిపాజిట్ చేయవచ్చు అన్నారు. ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈనెల 26వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతిపాదించే అభ్యర్థులు ఫారం-ఎ, ఫారం-బిలను జతపర్చాల్సి ఉంటుందన్నారు. బ్యాంక్ కొత్త ఖాతా తెరిచిన తదుపరి ఆ ఖాతానే వినియోగించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, బీజేపీ నాయకులు కేవీ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు దోనేపూడి రవి, సీపీఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆట్ల బాలాజిరెడ్డి, వైసీపీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, టీడీపీ నాయకులు షేక్ మహ్మద్‌గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ రంజిత్‌బాషా

పెన్షన్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

● నగదు లేకపోతే తాము ఏం చేస్తామంటున్న అధికారులు

● గ్రామాల్లో ప్రారంభం కాని పంపిణీ

రేపల్లె, ఏప్రిల్ 3 : పెన్షన్‌దారులపై అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో వివక్షత చూపుతూ గంటల తరబడి సచివాలయం వద్ద వేచి చూసే విధంగా అధికారులు వ్యవహరించారు. పట్టణంలో బ్యాంకు అకౌంట్‌లలో నగదు జమకాలేదని, మేము ఏమీ చేయలేమంటూ అధికారులు తేల్చి చెప్పటంతో ఉదయం 9 గంటలకు వచ్చి మధ్యాహ్నం ఒంటిగంట దాకా సచివాలయాల దగ్గర పెన్షన్‌ల కోసం వేచి చూసి విసుగు చెంది వెళ్లిపోయారు. కనీసం సచివాలయాల వద్ద టెంట్‌లు వేశారే తప్పా ఎక్కడా కూడా తాగునీరును ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీనికి తోడు సచివాలయం వద్ద ఒక్క సిబ్బంది కూడా లేకుండా ఉండటంతో పింఛన్‌దారులు నిరాశకు లోనై వెనుతిరిగి వెళ్లిపోయారు. సాయంత్రం 3 గంటల సమయంలో పట్టణంలోని కొన్ని సచివాలయా ల్లో నగదు జమ కావటంతో పింఛన్లు 4గంటల సమయంలో 5వవార్డు లో నేతాజీనగర్ 24వవార్డులో పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది మాత్రం సచివాలయం వద్దకు వస్తేనే పింఛన్‌లు అందిస్తామని ఇళ్ళకు వచ్చి పింఛన్‌లు ఇవ్వమని తెలుపుతున్నారు. ఒక ప్రక్క ప్రభుత్వం లేవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ఇళ్ళకే వెళ్ళి పెన్షన్‌లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా సచివాలయ సిబ్బంది మాత్రం ఆదేశాలను ఖాతరు చేయటం లేదు. పట్టణంలోని 3వ వార్డులో నగదు జమ కాకపోవటంతో పింఛన్‌లు సాయంత్రం 5 గంటల వరకు కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలోని రేపల్లె రూరల్ మండలం నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లో హెడ్ క్వార్టర్స్‌లో తప్పితే గ్రామాల్లో ఎక్కడా కూడా పింఛన్‌లు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇందుకు కారణం నగదు జమకాకపోవటమే కారణమని సచివాలయ సిబ్బంది తెలుపుతున్నారు. దీంతో గ్రామాల్లో సచివాలయాల వద్దకు వచ్చి పింఛన్‌దారులు నిరాశతో వెనుతిరిగి వెళ్ళిన పరిస్థితి నెలకొంది. వైసీపీ నాయకులు ఆదేశాలతోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల వద్ద పింఛన్‌దారులు వేచి చూసే విధంగా చేశారని, పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆనందబాబు గెలుపు కోసం విస్తృత ప్రచారం

భట్టిప్రోలు, ఏప్రిల్ 3: మాజీ మంత్రి నక్కా ఆనందబాబు గెలుపును కాంక్షిస్తూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా 7వ రోజు స్థానిక భోగేశ్వరపేటలో బుధవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల ను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభు త్వం ఏర్పడాల్సిన అవసరం గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం జరగాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాల్సిన అవసరం ఉందని నియోజకవర్గంలో నక్కా ఆనందబాబును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక భోగేశ్వరపేటలో ప్రచారం నిర్వహిస్తున్న సాయిబాబా తదితరులు

ఆనందబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించండి

కొల్లూరు, ఏప్రిల్ 3: టీడీపీ, జనసేన, బీజేపీ వేమూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబును గెలిపించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలపరిధిలోని రావికంపాడు గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి బాబు సూపర్ 6 పథకాల గురించి వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని విధాల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నా రు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసా ద్, పార్టీ నాయకులు యలవర్తి కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, తుమ్మల బాపయ్య చౌదరి, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, పులివర్తి నాంచారయ్య, కోగంటి తేజ, గంటా వెంకటేశ్వరరావు, దొడ్డపనేని రాధాకృష్ణమూర్తి, సుభాష్ చంద్రబోస్, లంకా పిచ్చ య్య, కనపర్తి సుధాకర్, మొద్దు శ్రీను, గుమ్మడి శివ, కోగంటి శివ వెంకటేశ్వరరావు, జీఎల్‌జీ భగవాన్, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రావికంపాడులో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

చంపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అఖిలేష్

వేమూరు, ఏప్రిల్ 3: తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేష్ బుధవారం రాత్రి మండలంలోని చంపాడు గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి తన తండ్రి ఆనందబాబును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి పుష్పగుచ్ఛంతో అఖిలేష్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కన్యధార తాతాజీ, పీకా రాజేంద్రప్రసాద్, తేజాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చంపాడులో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అఖిలేశ్

పింఛన్ల పంపిణీపై వైసీపీ అబద్ధాలు

» జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు జనం సిద్ధం

» ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 3 : రాజకీయ లబ్ధి కోసమే పింఛన్ల పంపిణీని వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసిందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. బుధవారం మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో మార్టూరు, యద్దనపూడి మండలాల క్లస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ఏలూరి వారికి దిశానిర్దేశం చేశారు. పింఛన్‌లను సకాలంలో అందజేయకుండా వైసీపీ రాజకీయ డ్రామా ఆడుతోందన్నారు. వైసీపీ పాలనలో సాగించిన అక్రమాలను కూకటివేళ్లతో పెకిలించడానికి, జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారని ఏలూరి అన్నారు. ప్రజా సంక్షేమం కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ చేపట్టే సంక్షేమ పథకాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల కష్టాలు తీర్చేందుకు కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలు ఇప్పటికే మనస్సులో నిర్ణయించుకున్నారని ఏలూరి అన్నారు. పేదరిక నిర్మూలన, అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మీదేనన్నారు. మరో 45 రోజులలో జగన్‌రెడ్డి పార్టీ గాలికి కొట్టుకుపోతుందన్నారు. సమావేశంలో గుదే తారక రామారావు, బోయపాటి సాంబయ్య, రంగయ్య చౌదరి, అనిల్ పాల్గొన్నారు.



పూనూరు క్లస్టర్ యూనిట్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

గ్రామాలలో పర్యటించిన ఏలూరి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం మండలంలోని రాజుపాలెం, కోలలపూడి, తాటి వారిపాలెం గ్రామాలలో పర్యటించారు. రాజుపాలెం గ్రామంలో అడుసుమల్లి నాగ శ్రీహర్ష, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడుసుమల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం కోలలపూడి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు తదితరుల పర్యవేక్షణలో ఏలూరి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. తాటివారిపాలెంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మాజీ సర్పంచ్ వజ్జా వీరాంజనేయులను ఏలూరి పరామర్శించారు.


పర్చూరులో టీడీపీ, జనసేన కూటమి ప్రచారంలో పాల్గొన్న శ్రేణులు

పర్చూరులో జోరుగా కూటమి ప్రచారం

ఉత్సాహంగా పాల్గొంటున్న యువత

పర్చూరు, ఏప్రిల్ 3 : పర్చూరులో తెలుగుదేశం, జనసేన, బీ జేపీ కూటమి ప్రచారం జోరుగా సాగుతోంది. పెద్దఎత్తున యువకులు, మహిళలు తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. మేనిఫెస్టోలో రూపొందించిన పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ నా యకులు ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలోని పలు వీధుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, తంగెళ్ల మల్లికార్జునరావు, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, శ్రీరాం వెంకటసుబ్బారావు, మల్లాది సురేష్, కొల్లా చౌదరి, కోటగిరి ప్రసాద్, పఠాన్ బాజీ, కృష్ణంశెట్టి జగదీష్, షేక్ బుల్లా మేస్త్రీ, జనసేన నాయకులు దీర్ఘాల రమేష్ నాయుడు, బేత భూపతి, జట్టి పాల్గొన్నారు.


శివారు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్న ఈపూరుపాలెం పోలీసులు

ఎన్నికలకు ప్రత్యేక నిఘా

గవినివారిపాలెం(చీరాలటౌన్), ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఈపూరుపాలెం ఎస్‌ఐ మర్రి శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని గవినివారిపాలెంలో ప్రత్యేక పోలీసు బృందాలతో కవాతు నిర్వహించారు. బస్, ఆటో పలు రకాల అనుమానస్పద వాహనాలు తనిఖీ చేశారు. అలాగే శివారు ప్రాంతంలోని పొలాల్లో సైతం కవాతు నిర్వహించి తనిఖీలు చేశారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక పోలీసు బృందం పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

చినగంజాం : ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో పోలీసులతో కలిసి కేంద్ర సాయుధ బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకుండా ముందుస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ఒకసారి కేసు నమోదైతే ప్రతి ఎన్నికల్లోను వారిపై నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు వివాదాలకు తావు లేకుండా అందరూ సహకరించాలని కోరారు. ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్లలో..

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాని మేదరమెట్ల ఎస్‌ఐ చంద్రశేఖర్ కోరారు. బుధవారం మేదరమెట్లలో కేంద్ర బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలలో ఎటువంటి అవాంచనీయ సంఘటలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుతంగా పోలింగ్ నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. డీఎస్పీ అనుమతి లేకుండా మైకులు వాడకూడదన్నారు. సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోవాలి : ఆర్డీవో


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో రవీందర్

పర్చూరు, ఏప్రిల్ 3: వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాలను వినియోగించుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో గంధం రవీందర్ అన్నారు. పర్చూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంతోపాటు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడలిగా ఉన్న ప్రాంతంలో వివిధ పనుల కోసం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య, ఎంఈవో వెంకట్రామయ్య, డీటీ లగడపాటి నాగలక్ష్మి, ఆర్‌ఐ ప్రేమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాలొన్నారు.

మార్టూరులో

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్‌డీవో రవీందర్ బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవిలో ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని కొనసాగించాలని ఆర్‌డీవో రవీందర్ తహసీల్దార్ సంధ్యశ్రీకి సూచనలు చేశారు. అనంతరం మార్టూరులో పాండురంగస్వామి గుడి సమీపంలో హోం ఓటింగ్ 12 డీ ఫారాన్ని మంచంపై ఉన్న వృద్ధుడికి ఆయన అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఆర్‌ఐ రహమాన్ బాషా పాల్గొన్నారు.

యద్దనపూడిలో

యద్దనపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఆర్‌డీవో రవీందర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామంలోని మోడల్ పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలింగ్ స్టేషన్‌లో ఉన్న వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.నాగరాజు, ఆర్‌ఐ విష్ణు, ఎంపీడీవో శివ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక పోటీతత్వం

చీరాల, ఏప్రిల్ 3 : క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు స్నేహపూర్వక పోటీతత్వం అలవడుతుందని వైసీపీ చీరాల నియోజకవర్గ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. దండుబాట జాలమ్మగుడి వెనుక బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీలను వెంకటేష్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. తరువాత కొంతసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. అనంతరం క్రీడాకారుల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగింది. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేష్

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

» ఎమ్మెల్యే గొట్టిపాటి

బల్లికురవ, ఏప్రిల్ 3 : ఎన్నికలలో తెలుగదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కోరారు. బుధవారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే గృహంలో బుధవారం మండలంలోని వేమవరానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వైసీపీ పార్టీ చేపట్టిన తప్పుడు పనుల వలన అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పట్టకుండా ప్రచార పిచ్చితో జగన్ పనిచేశారని అయన విమర్శించారు. అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వారితో చర్చించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ద్వారా పలు సీసీ రోడ్లు వేయించిన విషయాన్ని అయన వారికి గుర్తు చేశారు. పార్టీలో చేరిన వారిలో గరికపాటి సుబ్బారావు, ధర్మయ్య, పొత్తూరి సతీష్, గరికపాటి సత్యనారాయణ, చలపతి, రామకోటేశ్వరరావు, పొత్తూరి సుబ్బారావు, రామారావు, గోవర్ధనయ్య, హరిబాబు ఉన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వేమవరం వాసులు

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

మండలంలోని వేమవరం గ్రామంలో టీడీపీ నేత పేరం సుబ్బయ్య కుమారుడు సాయితేజ ఇటీవల మృతి చెందడంతో బుధవారం వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శించారు. అలాగే ఎస్టీ కాలనీలో కార్యకర్త భూక్యానాయక్ మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ నేతలు గొట్టిపాటి మారుతి ఉన్నారు.

ఒక వైపు తండ్రి ... మరో వైపు తనయుడు

ఈపురుపాలెంలో అభ్యర్థి కొండయ్య... కొట్లబజారులో మహేంద్రనాథ్ ప్రచారం

చీరాల, ఏప్రిల్ 3 : ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఆయన తనయుడు మహేంద్రనాథ్ బుధవారం పార్టీల శ్రేణులతో కలసి వేర్వేరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండయ్య మండలంలోని ఈపురుపాలెంలో నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు గుద్దంటి చంద్రమౌళి, కొమ్మనబోయిన రజని తదితరులు ఆయా ప్రాంతాల వారిని పరిచయం చేశారు. ప్రధానంగా మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో వారు పర్యటించిన ప్రాంతాల్లో సానుకూలత లభించింది. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణంలోని కొట్లబజారులో తదితర ప్రాంతాల్లో కొండయ్య కుమారుడు మహేంద్రనాథ్, పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు, ఎంఆర్ఎఫ్ రమేష్, నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు. పార్టీ కార్యాలయంలో పలువురు పాస్టర్లు కొండయ్యను కలసి ఆత్మీయతను తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసే, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఈపురుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య


కొట్లబజారులో ప్రచారం చేస్తున్న మహేంద్రనాథ్

లక్ష్మి మృతికి ఏలూరి సంతాపం

పర్చూరు, ఏప్రిల్ 3 : విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శివాలశెట్టి కృష్ణారావు సతీమణి శివాలశెట్టి లక్ష్మి మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం పర్చూరులోని ఆమె నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె కుమారుడు మాజీ క్రికెటర్ శివాలశెట్టి రవిని పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. అదే గ్రామంలో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు షేక్ కరిముల్లా మృతదేహాన్ని సందర్శించి ఏలూరి నివాళులర్పించారు. ఆయనవెంట టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, నాయకులు కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, తంగెళ్ల మల్లికార్జునరావు, తులసి శ్రీనివాసరావు, ఆకుల మధుబాబు, మల్లాది సురేష్, శ్రీరాం వెంకట సుబ్బారావు, పఠాన్ సమీర్, పఠాన్ మీరావలి, పఠాన్ బాజీ ఉన్నారు. దీనికి ముందు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ లక్ష్మి మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు విన్నకోట అజయ్, కారంపూడి సందీప్ తేజ, అచ్చుకోలు సతీష్, తులసి చంటి పాల్గొన్నారు.


లక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కిషోర్‌బాబు

కాంగ్రెస్ మేనిఫెస్టోతో అందరికీ లబ్ధి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలతో పేద ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్‌బాబు అన్నారు. బుధవారం అద్దంకిలో ఇండియా కూటమి ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ అద్దంకి మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలల్లో పర్యటించి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. నన్ను నమ్మి నాకు ఓటు వేసిన వారికి ఎప్పుడైనా వైద్య సాయంలో భాగంగా సగం నగదు చెల్లించేందుకు నేను సిద్ధంగా ఉన్నానని, ఇది నా వ్యక్తి గత హామీ అన్నారు. స్థానికులను నమ్మి ఓటు వేయాలని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాకే ప్రథమ ప్రాధాన్యత అన్నారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ జాయింట్ డైరెక్టర్ కోరే సురేంద్రనాథ్, శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ నాయకులు నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు సురేష్‌బాబు, కబలా సుబ్రహ్మణ్యం, మహిళ నాయకురాలు రోజారాణి, సజీనా పాల్గొన్నారు.


భీమావారిపాలెం సచివాలయం వద్ద పెన్షన్ కోసం ఉన్న వారితో మాట్లాడుతున్న కూటమి నరేంద్రవర్మ, తెన్నేటి

చేసింది చెప్పుకోవడానికి లేక టీడీపీపై విమర్శలు

కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్

బాపట్ల,ఏప్రిల్ 3 : వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిన ప్రగతి చెప్పుకోవడానికి ఏమీలేక పెన్షన్ రాకుండా చేస్తున్నారని చంద్రబాబుపై వైసీపీ మూకలు విమర్శలు చేస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని భీమావారిపాలెం సచివాలయం వద్ద పెన్షన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులను బుధవారం వారు పలకరించారు. పెన్షన్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ నుంచి ఇంకా డబ్బులు రాలేదని వచ్చిన వెంటనే ఇస్తామని సచివాలయ సిబ్బంది చెప్పినట్లు లబ్ధిదారులు తెలిపారు. దీనిపై నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులను అడ్డుపెట్టుకొని టీడీపీపై దుష్ప్రచారాలు చేయటాన్ని మానుకోవాలని వైసీపీని హెచ్చరించారు. చంద్రబాబు పెన్షన్‌ల విషయమై ఎన్నికల కమిషన్, చీఫ్ సెక్రెటరీతో మాట్లాడి పెన్షన్ సజావుగా లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరినట్లు తెలిపారు. రెండునెలలు తర్వాత టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే వచ్చి రూ.4వేల పింఛన్ ఇస్తామని తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నోటి సమస్యల నుంచి విముక్తి

» జిల్లా హాస్పిటల్‌లో నోటి కేన్సర్‌ను గుర్తించే పరికరం ఏర్పాటు

» ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారులు పిలుపు

చీరాలటౌన్, ఏప్రిల్ 3 : నోటి నుంచి వచ్చే అతి భయంకరమైన రోగముల నుంచి ప్రజలు విముక్తి పొందాలని పలువురు వైద్యాధికారులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏరియా వైద్యశాలలో హాస్పిటల్ దంత వైద్య నిపుణులు డా.సునయన, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నోటి ద్వారా సంక్రమించే కేన్సర్‌ను ముందుగానే గుర్తించే వెల్‌స్కోప్ పరికరం ఇక నుంచి బాపట్ల జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. దీనికి సంబంధించి స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. పలువురికి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే నేరుగా జిల్లా హాస్పిటల్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ డా.శేషుకుమార్, ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డా.సుభాషిణి, జిల్లా దంత వైద్యులు డా.శశికుమార్, నర్సింగ్ ఫ్యాకల్టీలు, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పింఛన్ లబ్ధిదారులకు అసౌకర్యం కల్పించవద్దు

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి


మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, ఏప్రిల్ 3 : పింఛన్ అందుకునేందుకు వచ్చే లబ్ధిదారులకు అసౌకర్యం కలుగకుండా సేవలందించాలని చీరాల మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. పింఛన్‌ల పంపిణీ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆంధ్రరత్ననగర్ సచివాలయాన్ని కమిషనర్ సందర్శించి పంపిణీను పరిశీలించారు. పింఛన్‌దారులతో మాట్లాడారు. అలాగే సేవలపై ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని సిబ్బందికి సూచించారు. విధిగా తాగునీరు. షామియానా, కుర్చీలు వివిధ సౌకర్యాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సాయంత్రం నుంచి సచివాలయ సిబ్బందితో పంచన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. బ్యాంకుల నుంచి నగదు తెచ్చుకోవడం ఆలస్యం కావడంతో ఎంపీడీవో కార్యాలయం నుంచి నగదు సమకూరింది. గురువారం అన్ని గ్రామాలలో పింఛన్ల పంపిణీ వేగవంతం చేసేలా అధికారులు సిద్ధం చేస్తున్నారు.

పర్చూరు : పర్చూరు మండల పరిధిలో బుధవారం ఆయా గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద పెన్షన్‌ల పంపిణీ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బంది ఉరుకులు పరుగులు తీసారు. మరో ప్రక్క పెన్షన్ దారులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పంపిణీ కేంద్రాల వద్ద పీఆర్ సిబ్బంది నేతృత్వంలో మంచినీటి సౌకర్యంతోపాటు, సచివాలయాల ప్రాంగణంలో టెంట్‌లను కూడా ఏర్పాటు చేశారు. వృద్ధులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా సిబ్బంది త్వరిత గతిన ఫించన్‌లను అందజేశారు. పర్చూరు మండల పరిధిలో మొత్తం 8,345 పెన్షన్‌లకు సబంధించిన లబ్ధిదారులు ఉండగా రూ.2కోట్ల,52లక్షల, పదివేలు అందజేసే విధంగా చర్యలు చేపట్టామని ఎంపీడీవో బి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ పిచ్చిరెడ్డి సందర్శించి పరిశీలించి, సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు.


పర్చూరు సచివాలయం వద్ద పెన్షన్‌లను అందజేస్తున్న సిబ్బంది

మార్టూరు : మండలంలో బుధవారం సాయంత్రం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రారంభించారు. ఉదయం నుండి పెన్షను సొమ్ములు కోసం వృద్ధులు, వితంతువులు, పెన్షను దారులు సచివాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే బ్యాంకు నుండి నగదు తీసుకురాలేదని చెప్పిన సచివాలయం సిబ్బంది ఎట్టకేలకు సాయంత్రం 4 గంటల తర్వాత పెన్షను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.పెన్షను దారులు తప్పని సరిగా ఆదార్ కార్డు లను తీసుకురావాలని చెప్పడంతో సచివాలయం వద్దకు వచ్చిన పెన్షను దారులు మరల ఇంటికి వెళ్లి ఆధార్ కార్డులను తీసుకురావడంతో సచివాలయాల వద్ద రద్దీ ఏర్పడింది.

యద్దనపూడిలో

యద్దనపూడి మండలంలో పూనూరు లోని రెండు సచివాలయాలు, యద్దనపూడి సచివాలయంలో మాత్రం బుధవారం పెన్షను పంపిణీ జరగలేదు. మిగిలిన అన్ని గ్రామ సచివాలయాల్లో పెన్షను పంపిణీ చేశారు. అయితే సరిపడా నగదు రాకపోవడంతో మూడు సచివాలయాల్లో పెన్షను పంపిణీ చేయలేదని, గురువారం ఈ మూడు సచివాలయాల్లో పెన్షను పంపిణీ చేస్తామని యంపీడీవో శివ సుబ్రమణ్యం తెలిపారు.

నేటి నుంచి మూడు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నీ

బల్లికురవ, ఏప్రిల్ 3 : మండలంలోని కొణిదెన గ్రామంలో నేడు గురువారం నుంచి బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. మెదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ. 15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాలుగో బహుమతిగా రూ.5,116 అందిస్తున్నామని ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన వచ్చని నిర్వాహకులు కోరారు.

250 మందికి ఉచిత వైద్య సేవలు

ఇంకొలు, ఏప్రిల్ 3 : మండలంలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను వైద్య సిబ్బంది ఉచితంగా నిర్వహించారు. గుండె, కిడ్నీ, విష జ్వరాలు, ఇతర వ్యాధులపై వైద్యులు అవగాహన కల్పించారు. అనంతరం మందులను ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ మహిత, ఆప్తమాలజిస్ట్ రాణి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది